సాక్షి
ఖమ్మం

గురువారం । 18 । సెప్టెంబర్ । 2025



యాత్రాదానం.. సేవాభావం

పుణ్యక్షేత్రాలు, పర్యాటక, విజ్ఞాన విహార యాత్రలకు వెళ్లలేని పేదల కోసం ఆర్టీసీ 'యాత్రాదానం'కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 8లో



ఆలయ అభివృద్ధే లక్ష్యం

భద్రాచలం రామాలయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే తన ప్రథమ ప్రాధాన్యమని ఈఓ దామోదర్ రావు అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 23°

వాతావరణం

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్ని ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఖమ్మం మీదుగా అమృత్ భారత్ రైలు

ఖమ్మం రాపర్తినగర్ : దక్షిణ మధ్య రైల్వే శాఖ మరో అమృత్ భారత్ రైలును ఖమ్మం మీదుగా నడపనుంది. ఈ రైలు వారంలో ఒకరోజు మాత్రమే ఉంటుందని అధికారులు తెలిపారు. ఈరోడ్ నుంచి జోగ్‌బని వెళ్లే రైలు(16601) ఈనెల 25న గురువారం రాత్రి 23:09 ని.లకు ఖమ్మం స్టేషన్‌కు వచ్చి 23:10 ని.లకు బయలుదేరుతుందని, జోగ్‌బని–ఈరోడ్ రైలు (16602) మధ్యాహ్నం 12.24 ని.లకు వచ్చి 12:25ని.లకు బయలుదేరుతుందని తెలిపారు. ఇందులో స్లీపర్, జనరల్ కోచ్‌లు ఉంటాయని పేర్కొన్నారు.

సకాలంలో టీకాలు వేయాలి

జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ రమణ



టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న రమణ

కల్లూరు/కల్లూరురూరల్ : గర్భిణులు, చిన్నారులకు సకాలంలో టీకాలు వేసి వారి ఆరోగ్య పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సీహెచ్.వి.రమణ అన్నారు. కల్లూరు మండల కేంద్రంతో పాటు బత్తులపల్లి, చెన్నూరు ప్రభుత్వాస్పత్రుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీకా కార్యక్రమాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇంకా టీకాలు వేయని వారుంటే బుధవారం నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించే స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో గుర్తించి అందరికీ వేయాలని, యూడబ్ల్యూఐఎన్ పోర్టర్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. చిన్నారులు, మహిళల ఆరోగ్య భద్రతకు ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. టీకాల కార్యక్రమంపై ప్రభుత్వ వైద్యులు డాక్టర్ నవ్యకాంత్ తదితరులతో చర్చించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాణి, అధికారులు, సిబ్బంది వేణుగోపాల్, సత్యనారాయణ, నవీన్, కిరణ్, గుండె పునేని రామారావు పాల్గొన్నారు.

311 మంది ఉపాధ్యాయుల సర్దుబాటు

ఖమ్మం సహకారనగర్ : జిల్లాలో ఖాళీగా ఉన్న వివిధ సబ్జెక్టుల ఉపాధ్యాయులను సర్దుబాటు (వర్క్ అడ్జస్ట్‌మెంట్) చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారిగా ఉన్న అదనపు కలెక్టర్ పి.శ్రీజ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో 311 మంది ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టినట్లుగా అధికారులు తెలిపారు. స్థానిక మండలాల్లో ప్రాధాన్యత ఇచ్చి అవసరమైన మేరకు సర్దుబాటు చేయగా మిగిలిన వారిని ఇతర ప్రాంతాలకు పంపించారు. కాగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గతంలో చేసిన డిప్యుటేషన్లను రద్దుచేసినట్లు తెలిపారు.

హామీలన్నీ అమలు చేస్తున్నాం

జిల్లాలో కొత్తగా 24,818 కుటుంబాలకు రేషన్ కార్డులు

- ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు రూ.కోట్లలో ఆదా
- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క వెల్లడి
- ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ

జాతీయజెండా ఆవిష్కరిస్తున్న భట్టి



ఖమ్మంసహకారనగర్: ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే అమలు చేయడం ప్రారంభించామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇందిరా మహిళా శక్తి పథకం కింద మహిళా సంఘాల ద్వారా 2వేల మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఉత్పత్తికి ప్రణాళికలు చేపట్టామన్నారు. ఇందిరా సౌర గిరి జలవికాసం పథకం కింద 2025 – 26 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 550 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామని, వారికి సోలార్ పంపుసెట్లు అందిస్తామని తెలిపారు. జిల్లాలో కొత్తగా 24,818 కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు జారీ చేశామని చెప్పారు.

70వేల మందికి ఉచిత విద్య..

జిల్లాలో 1,257 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 70,257 మంది విద్యార్థులు ఉచితంగా చదువుకుంటున్నారని భట్టి తెలిపారు. ఆరోగ్య లక్ష్మి పథకం కింద 1,840 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 12,542 మంది గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు చిన్నారులు 35,282 మందికి పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రూ.180 కోట్లతో మున్నేరు నదిపై తీగల వంతెన, రూ.130 కోట్లతో వైద్య కళాశాల భవన నిర్మాణం పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. రూ.139 కోట్లతో పది రెండు లేన్ల రోడ్లను నాలుగు వరుసల రహదారులుగా విస్తరిస్తామని అన్నారు. మధిర, సత్తుపల్లిలో రూ.34 కోట్ల చొప్పున ఖర్చు చేస్తూ 100 పడకల ఆస్పత్రులు, కల్లూరులో రూ.10.50 కోట్లతో 50 పడకల సీహెచ్‌సీ, పెనుబల్లిలో రూ.7.50 కోట్లతో 30 పడకల కమ్యూనిటీ సెంటర్‌ను పూర్తి చేసినట్లు తెలిపారు. అనంతరం పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను భట్టి సందర్శించి విద్యార్థులు, సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, డీఆర్ఓ పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైన, నాయకులు పోట్ల నాగేశ్వరరావు, కొండబాల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్‌పీడీసీఎల్ స్టాల్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



నృత్యం చేస్తున్న బీసీ గురుకుల విద్యార్థులు

అభయహస్తం పథకాల అమలు..

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూనే అభయ హస్తం గ్యారంటీ పథకాలు అమలు చేస్తున్నామని భట్టి చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 4,44,48,224 మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేయడం ద్వారా రూ.209,21,46,000 ఆదా చేశారని వివరించారు. గృహజ్యోతి పథకం కింద జిల్లాలో రూ.160.30 కోట్ల సబ్సిడీ చెల్లించి 2,43,852 కుటుంబాలకు లబ్ధి చేకూర్చామని తెలిపారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తున్నామని, పూర్తి సబ్సిడీతో రూ.5 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు నిర్మాణ దశలను బట్టి లబ్ధిదారుల ఖాతాల్లో రూ.122.89 కోట్లు జమ చేశామన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా జిల్లాలో 10,876 మందికి వైద్య సేవలు అందించి రూ.22,90,57,000 ఖర్చు చేశామని చెప్పారు.

అంకితభావంతో సేవలందించాలి

ఖమ్మంవైద్యవిభాగం: ప్రైవేట్ ఆస్పత్రుల వారు ప్రజారోగ్యం పట్ల అంకిత భావంతో సేవలు అందించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క అన్నారు. బుధవారం ఆయన వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఉందని, ఎన్ని అవాంతరాలొచ్చినా ప్రజలకు ఇబ్బంది కావొద్దనే లక్ష్యంతో చాలా ఆస్పత్రులను ఆరోగ్య శ్రీ నెట్‌వర్క్ హాస్పిటల్స్ పరిధిలో చేర్చుకుందని తెలిపారు. జిల్లా స్థాయిలో కో–ఆర్డినేటర్ల ద్వారా మానిటరింగ్ చేస్తూ రూ.కోట్ల బడ్జెట్‌ను కేటాయించిందన్నారు. ప్రతి ప్రైవేట్ ఆస్పత్రి పొల్యూషన్ బోర్డ్ సర్టిఫికెట్, బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో నాణ్యతలు పాటించాలని, పేషెంట్‌తో పాటు అతడితో వచ్చే వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని, వైద్య సేవలకు, సర్జరీలకు తీసుకునే చార్జీల వివరాలను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం నియమ, నిబంధనలు ప్రైవేట్ ఆస్పత్రులు పాటిస్తున్నాయా లేదా అని తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, డీఎంహెచ్ఓ బి.కళావతిబాయి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ నరేందర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ చందునాయక్, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి, పక్కన కలెక్టర్ అనుదీప్, సీపీ సునీల్‌దత్ తదితరులు

- మహిళా ఆరోగ్య పరిరక్షణకు కృషి
- విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం ఇస్తున్నాం
- రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి

తిరుమలాయపాలెం: పేదల సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మహిళల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. 'స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్' కార్యక్రమాన్ని తిరుమలాయపాలెం మండల కేంద్రంలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట వేస్తోందని, ఈ రెండు రంగాలకు పుష్కలంగా నిధులు వెచ్చిస్తోందని తెలిపారు. ఆడబిడ్డలకు అండగా నిలుస్తోందని, ప్రధానమంత్రి ఆలోచనలకు అనుగుణంగా వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆదుకుంటోందని చెప్పారు. వైద్యాధికారులు అంకితభావంతో పని చేయాలని, దూర ప్రాంతాల నుంచి రావడం, ఒక గంట సేపు ఉండివెళ్లడం వంటివి చేయొద్దని సూచించారు. వైద్యులు దేవుడితో సమానమని, రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. తిరుమలాయపాలెం ఏరియా ఆస్పత్రి 30 పడకల నుంచి 50 పడకలకు అప్‌గ్రేడ్ అయిందని, కొత్త స్కానింగ్, ఎక్స్ రే మిషన్లు, ఇతర పరికరకాలను ఈ నెలాఖరులోగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళలు, పిల్లల ఆరోగ్య సంరక్షణకు చేపట్టిన స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని మొక్కుబడిగా కాకుండా చిత్తశుద్ధితో అమలు చేయాలని ఆదేశించారు. అంతకుముందు ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆస్పత్రిలో అందుతున్న ఓపీ, ఐపీ సేవలను పరిశీలించారు. అనంతరం కంటి పరీక్షల యూనిట్, ఇతర ఓపీ సేవలను ప్రారంభించారు. ఆ తర్వాత పోషణ మాసం –2025 పోస్టర్‌ను పొంగులేటి ఆవిష్కరించారు. 21 మందికి కల్యాణలక్ష్మి/షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం రూ.1.50 కోట్లతో చేపట్టనున్న తిరుమలాయపాలెం – ములకలపల్లి హై లెవల్ బ్రిడ్జి అప్రోచ్ మరమ్మతు పనులకు శంకుస్థాపన చేశారు.

ఉద్యమంలా చేపట్టాలి..

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ప్రతీ మహిళ, పిల్లలు పరీక్షలు చేయించుకునేలా ఆశ కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. వ్యాధులు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. స్పెషలిస్ట్ వైద్యులతో క్యాంపులు నిర్వహించి ఉచిత పరీక్షలు, చికిత్స అందిస్తారని అన్నారు. కార్యక్రమంలో సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, డీసీహెచ్ఎస్ రాజశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్ఓ చందూనాయక్, వైద్యాధికారులు డాక్టర్ కృపా ఉషశ్రీ అమర్‌సింగ్, బొల్లికొండ శ్రీనివాసరావు, వైదేహి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, పీఆర్ ఎస్ఈ వెంకట్‌రెడ్డి, డీఈ వేణుగోపాల్ డీపీఓ రాంబాబు, తహసీల్దార్ విల్సన్, ఎంపీడీఓ సిలార్ సాహెబ్, ఆత్మ చైర్మన్ చావా శివరామకృష్ణ, రామసహాయం నరేష్‌రెడ్డి, బెల్లం శ్రీనివాస్, మాజీ ఎంపీపీలు కొప్పుల అశోక్, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు పొంగులేటి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11.10 గంటలకు తిరుమలాయపాలెం మండలం కుక్కలతండాలో ఖమ్మం–వరంగల్ ఆర్అండ్‌బీ రోడ్ నుంచి భూక్యాతండా వరకు నిర్మించే బీటీ రోడ్డుకు, 11.40 గంటలకు మేడిదపల్లిలో అంగన్‌వాడీ సెంటర్ భవనం, అంతర్గత సీసీ రోడ్డు, మధ్యాహ్నం 12.15 గంటలకు తిమ్మక్కపేట – ఏలువారిగూడెం ఆర్ అండ్‌బీ రోడ్డుకు, అంతర్గత రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. సాయంత్రం 3.10 గంటలకు కూసుమంచి, చేగొమ్మలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి, 4 గంటలకు కేశవాపురంలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు.

మతాల మధ్య చిచ్చుకు కుట్ర

- సాయుధ రైతాంగ పోరాటానికి మతం రంగు పులుముతారా..?
- సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, ఆర్ఎస్ఎస్ వంటి శక్తులు మత పరమైన రంగు పులుముతున్నాయని సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ విమర్శించారు. నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో బుధవారం రాత్రి జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ఈ పోరాటంలో శ్రామికులు, కార్మికులు, రైతులు భాగస్వాములయ్యారని, మహిళల భాగస్వామ్యం కూడా గొప్పదని అన్నారు. తెలంగాణ సాయుధ పోరులో అనేక మంది ప్రాణత్యాగం చేశారని నివాళులర్పించారు. దున్నేవాడికే భూమి కావాలని భూస్వాములకు ఎదురొడ్డి పోరాటం సాగిందని, దీని ఫలితంగానే లక్షలాది ఎకరాల భూములు పేదలకు పంచారని తెలిపారు. అయితే కేంద్రంలోని నేటి పాలకులు ఈ పోరాటానికి మతం రంగు పులుముతూ ముస్లింలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తూ మతాల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆరోపించారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటం భావి తరాలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దీన్ని ముస్లింలకు – హిందువులకు మధ్య జరిగిన పోరాటమని కొందరు వక్రీకరిస్తూ విమోచన, విలీనం, విద్రోహం అనే పేర్లతో తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. హక్కులు, వెట్టి చాకిరీ నుంచి విముక్తి, అత్యాచారాల నిరోధంతో పాటు దున్నేవాడిదే భూమి నినాదంతో తెలంగాణ సాయుధ పోరాటం సాగిందని తెలిపారు. పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, నాయకులు బండి రమేష్, పొన్నం వెంకటేశ్వరరావు, కల్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రం, ఎం. సుబ్బారావు, బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి బేబీ, పక్కన తమ్మినేని తదితరులు

అంధుల పాఠశాలకు ప్రణాళిక రూపొందించండి

కలెక్టర్ అనుదీప్ ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం సహకారనగర్ : అంధుల పాఠశాల నిర్మాణానికి పక్కా ప్రణాళిక తయారు చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు సూచించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీజ, జెడ్పీ సీఈఓ దీక్షారైనా, జిల్లా విద్యాశాఖ అధికారులతో తన క్యాంప్ కార్యాలయంలో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంధుల పాఠశాలలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని, వారి భద్రతను దృష్టిలో ఉంచుకొని పాఠశాల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. విద్యతో పాటు కంప్యూటర్ స్కిల్స్ అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన లిపి, పుస్తకాలు అందుబాటులో ఉంచాలని, పాఠశాలల్లో సెన్సరీ రూమ్, గార్డెన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. నాణ్యమైన వస్తువులు మాత్రమే వినియోగించాలన్నారు. మలక్‌పేటలోని అంధుల పాఠశాలను, దేవనార్ పాఠశాలను అధికారులు సందర్శించి.. జిల్లాలో చిన్న స్థాయిలో అంధుల పాఠశాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేయాలని చెప్పారు. సమావేశంలో సీఎంఓ ప్రవీణ్, స్పెషల్ ఎడ్యుకేటర్ రాకేష్, పంచాయతీరాజ్ ఏఈ చిరంజీవి పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

ఎర్రుపాలెం: విద్యుత్ వినియోగదారుల ఫోరంలలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తామని వరంగల్ జోన్ వినియోగదారుల ఫోరం చైర్మన్ ఎన్వీ వేణుగోపాలాచారి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయంలో వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక సదస్సు నిర్వహించారు. ఎర్రుపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో 4, మధిర రూరల్ మండలలో 2, మామునూరు సెక్షన్‌లో ఆరుగురు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో వైరా డీఈ బండి శ్రీనివాసరావు, విద్యుత్ టెక్నికల్ సభ్యుడు రమేశ్, ఫైనాన్స్ సభ్యుడు ఎస్.దేవేందర్, ఇండిపెండెంట్ సభ్యుడు ఎం.రామారావు, డి.సాంబశివ రావు, మధిర ఏడీఈ అనురాధ, ఏఈలు జి.అనూష, గణేశ్, లైన్‌మెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

మరో సర్వేకు అడుగులు

- ఎయిర్‌పోర్టు కోసం పట్టువిడవకుండా ప్రయత్నిస్తున్న మంత్రి తుమ్మల
- కొత్తగూడెంలో ఎదురవుతున్న సాంకేతిక చిక్కులు
- కొత్తగూడెం–భద్రాచలం మధ్య కొత్త స్థలాల పరిశీలన



భూమిని సర్వే చేస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరంగల్‌తోపాటు కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్, నిజామాబాద్‌లలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణం కోసం ప్రయత్నాలు మొదలెట్టింది. కొత్తగూడెంలో నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులో చిన్న విమానాలతోపాటు ఎయిర్‌బస్ వంటి భారీ విమానాలు ల్యాండింగ్, టేకాఫ్ తీసుకునేందుకు వీలుగా మూడు కిలోమీటర్ల పొడవైన రన్‌వే నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం 950 ఎకరాల భూమి అవసరమని భావించారు. కొత్తగూడెం మండల పరిధిలోని రామవరం, గరీబ్‌పేట శివారులలో 707, సుజాతనగర్ మండల పరిధిలో 195, చుంచుపల్లి మండల పరిధిలో 50 ఎకరాల స్థలాలను కూడా గుర్తించారు. ఇక్కడున్న ఎత్తైన గుట్టలు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడ్డంకిగా నిలిచాయి. మరోవైపు వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల విషయంలో సానుకూల ఫలితాలు వచ్చి క్షేత్రస్థాయిలో పనులు మొదలయ్యాయి. దీంతో సెప్టెంబరు 16న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి ఢిల్లీకి వెళ్లి కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడికి కొత్తగూడెం ఎయిర్‌పోర్టు కోసం విజ్ఞప్తి చేయగా.. మరోసారి ఫీజిబులిటీ సర్వేకు అడుగులు పడ్డాయి.

ఇరవై ఏళ్లుగా అదే సమస్య

కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ నిర్మించాలనే అంశంపై దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉన్నప్పటి నుంచీ ప్రయత్నాలు జరుగుతున్నాయి. సరైన స్థలాన్ని ఎంపిక చేయడమే సవాల్‌గా మారింది. భవిష్యత్‌లో బోయింగ్ విమానాలు దిగేందుకు వీలుగా వెయ్యి ఎకరాల్లో ఎయిర్‌పోర్టు కోసం సుజాతనగర్ ప్రాంతంలో భూములు వెతికారు. అయితే అది సాధ్యపడలేదు. చివరకు ఎయిర్‌కార్గో సేవల కోసం ప్రయత్నాలు చేసినా అవి ముందుకు సాగలేదు. తెలంగాణ వచ్చిన తర్వాత ముందుగా లక్ష్మీదేవిపల్లి మండలం పునుకుడుచెలక ఆ తర్వాత పాల్వంచ మండలం గుడిపాడు – బంగారుజాలల మధ్య ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం పలుమార్లు సర్వేలు జరిగాయి. పాల్వంచ పట్టణాన్ని అనుకుని ఉన్న ఎత్తైన గుట్టలు, కేటీపీఎస్ చిమ్నీలు, కూలింగ్ టవర్ల వల్ల సాంకేతిక ఇబ్బందులు రావడంతో ఈ ప్రతిపాదన అక్కడే ఆగిపోయింది.

ఎంతో ఉపయుక్తం

జిల్లాలో దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన భద్రాచలం రామాలయం దేశ వ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే దేశం నలుమూలల నుంచి భద్రాచలం క్షేత్రానికి భక్తులు వచ్చే అవకాశం ఉంది. సింగరేణి గనులు, హెవీ వాటర్ ప్లాంట్, ఐటీసీ, కేటీపీఎస్, బీటీపీఎస్ వంటి పరిశ్రమలు ఉన్నాయి. కొత్తగా మెడికల్ కాలేజీ, డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ జిల్లాలో ఏర్పాటైంది. దేశం మొత్తం మీద ఎర్త్ సైన్సెస్ విభాగంలో ప్రత్యేక కోర్సులు అందిస్తున్న వర్సిటీగా ఇది నిలిచింది. త్వరలోనే సేంద్రియ సాగు విధానానికి సంబంధించి ఎక్స్‌లెన్స్ సెంటర్ కూడా జిల్లాకు రానుంది. మరోవైపు అడవులు విస్తారంగా ఉండటంతో ఎకో టూరిజానికి ఈ ప్రాంతం అనువుగా ఉంది. ఇప్పటికే ఎకో టూరిజంలో ప్రసిద్ధి చెందిన మారేడుమిల్లి, పాపికొండలు, సీలేరు – పొల్లూరు వాటర్‌ఫాల్స్ వంటి ప్రదేశాలకు వెళ్లేందుకు భద్రాచలం గేట్‌వేగా ఉంది. ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఆధ్యాత్మిక, పారిశ్రామిక, పర్యాటక రంగాలు ఈ ప్రాంతంలో పుంజుకుంటాయి. సరికొత్త ఉపాధి అవకాశాలు వచ్చేందుకు ఆస్కారముంది.

కొత్తగూడెం-భద్రాచలం మధ్య..

ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం సుజాతనగర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, కొత్తగూడెం, పాల్వంచ మండలాల్లో ఎన్నిసార్లు స్థలాలను గుర్తించినా ఎత్తైన కొండలు, అభయారణ్యం, హై టెన్షన్ కరెంటు లైన్లు, రైల్వే మార్గాలు, నేల స్వభావం, గాలుల తీవ్రత, నీటి ప్రవాహాలు వంటి భౌగోళిక, సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో ఈ మండలాలను మినహాయించి భద్రాచలం – కొత్తగూడెం మధ్య ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనువుగా ఉన్న స్థలాలను పరిశీలనలోకి తీసుకునే అవకాశం ఉంది. త్వరలో జరగబోయే ఫీజిబులిటీ సర్వేకు సైతం ఇక్కడే స్థలాలను చూపించే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు రెండు మూడు చోట్ల స్థలాలను గుర్తించగా, ఇందులో ఒక స్థలాన్ని ఎయిర్‌పోర్టు కోసం ఫైనల్ చేయనున్నట్టు సమాచారం.

పంట నిల్వ ప్రాజెక్టులకు రాయితీలు

ఖమ్మంవ్యవసాయం: పంటల నిల్వ, రవాణా, ప్రాసెసింగ్ చేయడం వంటి ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీలు ప్రకటించింది. 2025–26 వార్షిక ప్రణాళికలో భాగంగా ఉద్యాన రైతులకు ఈ మేరకు ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించింది. దేశంలో రైతులు పండించిన పంటల్లో 20–30 శాతం వరకు తగిన నిర్వహణ లేక నాణ్యత కోల్పోయి మద్దతు ధర దక్కడం లేదు. ఉద్యాన పంటల్లో ప్రధానంగా పండ్లు కోత తరువాత శీతలీకరించడం, గ్రేడ్ చేయడం, ప్యాకింగ్, రవాణా, ప్రాసెసింగ్ వంటి విధానాలు అవలంబించడం ద్వారా విలువ పెరగడంతో పాటు ప్రత్యేక మార్కెటింగ్ చానల్ ద్వారా అమ్మకాలకు అవకాశం ఉంటుంది. తద్వారా రైతుల ఆదాయం పెరగడమే కాక వినియోగదారులకు నాణ్యమైన పండ్లు లభిస్తాయి. జిల్లాలో పండ్లతోటలు పెంచే రైతులకు ఏడు ప్యాక్ హౌస్ యూనిట్లు, రెండు కోల్డ్ స్టోరేజీ యూనిట్లు, ఒక రైపనింగ్ చాంబర్, 15సోలార్ ప్యానెల్ యూనిట్లు మంజూరయ్యాయని జిల్లా ఉద్యానాధికారి ఎం.మధుసూదన్ తెలిపారు. ఈ ప్రాజెక్టుల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉద్యాన పథకాలు, రాయితీల వివరాలు(రూ.లలో)

పథకం పేరు	రాయితీ శాతం	పూర్తి ధర	ప్రభుత్వ రాయితీ
ప్యాక్ హౌస్	50	4 లక్షలు	2 లక్షలు
ఇంటిగ్రేటెడ్ ప్యాక్‌హౌస్	35	1.60 కోట్లు	56 లక్షలు
సోలార్ ప్యానళ్లు	35	35 లక్షలు	12.25 లక్షలు
రైపనింగ్ చాంబర్	35	కోటి	35 లక్షలు
కోల్డ్ స్టోరేజీ	35	4.80 కోట్లు	1.68 కోట్లు



క్లుప్తంగా

అమెరికాలో కేయూ స్వర్ణోత్సవాలు



స్వర్ణోత్సవంలో పాల్గొన్న భారతీయులు

తల్లాడ: కాకతీయ విశ్వవిద్యాలయం ప్రస్థానం 50ఏళ్ల మైలురాయి చేరుకున్న సందర్భంగా అమెరికాలో ప్రవాస భారతీయులు ఘనంగా స్వర్ణోత్సవాలు జరుపుకున్నారు. రెండు రోజుల పాటు మిత్రులు, గురువులతో కలిసి అనుభవాలను నెమరువేసుకున్నారు. కేయూలోని ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌లో 1976 – 2025 వరకు అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులను పూర్తిచేసి అమెరికాలో వివిధ రంగాల్లో స్థిరపడిన 335 మంది అట్లాంటిక్ సిటీలోని క్యాసినోలో గల బోగట్ట హోటల్లో వేడుకలను సోమ, మంగళవారాల్లో జరుపుకున్నారు. తల్లాడ మండలం కుర్నవల్లికి చెందిన యన్నం శ్రీనివాసరెడ్డితో పాటు డాక్టర్ సాంబారెడ్డి, పరుచూరి శ్రీనివాస్, తమర విజయ్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. కేయూ ఉపకులపతి దర్శన ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, పారుపల్లి నేహా హాజరయ్యారు.

ఉద్యోగం సాధించిన ట్రాన్స్‌జెండర్



నియామక పత్రం అందుకుంటున్న రుచిత

వైరారూరల్: మండలంలోని గన్నవరం గ్రామానికి చెందిన ట్రాన్స్‌జెండర్ కోరే రుచిత అలియాస్ రమేశ్ హైదరాబాద్‌లోని మెట్రో రైలులో సెక్యూరిటీ గార్డ్‌గా ఎంపికై మంత్రి అట్లూరి లక్ష్మణ్ చేతుల మీదుగా మంగళవారం నియామక పత్రం అందుకున్నారు. రుచిత 2019 వరకు పురుషుడిగా ఉండి డిగ్రీ చదువుతూ మధ్యలోనే ఆపేశాడు. ఆ తర్వాత వరంగల్ వెళ్లి అక్కడ ట్రాన్స్‌జెండర్లతో కలిసి భిక్షాటన చేసిన రుచిత 2021లో హైదరాబాద్‌లో లింగ మార్పిడి ఆపరేషన్ చేయించుకొని ట్రాన్స్‌జెండర్‌గా మారాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లు ఆత్మగౌరవంగా జీవించేందుకు మెట్రో రైల్ శాఖలో సెక్యూరిటీ గార్డ్ పోస్టుల దరఖాస్తులకు ఆహ్వానించగా రుచిత దరఖాస్తు చేసుకొని ఉద్యోగాన్ని సాధించింది.

మట్టి తోలకాల స్థావరాలపై దాడి


బోనకల్: మండలంలోని లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో మట్టి తోలకాల స్థావరాలపై బుధవారం మధిర సీఐ మధు, ఎస్ఐ పొదిలి వెంకన్న, ఆర్ఐ షేక్ వహిదాసుల్తానా దాడులు నిర్వహించారు. కొంతకాలంగా లక్ష్మీపురం రెవెన్యూ పరిధిలో అనుమతులు లేకుండా కొందరు అక్రమ మార్గంలో వందల ట్రిప్పర్ల మట్టిని తరలిస్తున్నారు. దీంతో పోలీస్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడులు చేసి, అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్, టిప్పర్లను సీజ్ చేసినట్లు సీఐ మధు తెలిపారు.

చుక్కల దుప్పి మృతి

సత్తుపల్లి: వీధి కుక్కలు వెంట పడటంతో ఓ చుక్కల దుప్పి మృతి చెందిన ఘటన సత్తుపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. సింగరేణి అటవీ ప్రాంతం వైపునుంచి పట్టణంలోని జలగంనగర్‌కు వచ్చిన దుప్పి.. వీధి కుక్కలు వెంట పడటంతో మృతిచెందింది. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో మృతి చెందిన చుక్కల దుప్పిని స్వాధీనం చేసుకున్నారు. దుప్పి ఎలా చనిపోయిందో నిర్ధారించడం కోసం వెటర్నరీ వైద్యులతో పోస్టుమార్టం చేయించాల్సి ఉందని రేంజర్ స్నేహలత తెలిపారు.

యాత్రాదానం.. సేవాభావం

- వినూత్న కార్యక్రమానికి ఆర్టీసీ శ్రీకారం
- పేదలు, అనాథలను యాత్రలకు తీసుకెళ్లేలా కార్యాచరణ
- దాతలు ముందుకొస్తే బస్సుల కేటాయింపు



ఆర్టీసీ 'యాత్రాదానం'పోస్టర్



సత్తుపల్లి డిపో నుంచి పుణ్యక్షేత్రాలకు వెళ్లిన భక్తులతో అధికారులు (ఫైల్)

సత్తుపల్లిటౌన్: పుణ్యక్షేత్రాలు, పర్యాటక, విజ్ఞాన విహార యాత్రలను సందర్శించాలనే కోరిక ఎంతో మందికి ఉంటుంది. కానీ, పేదరికం వల్ల ఆ కల నెరవేర్చుకోలేని పరిస్థితి ఉంటుంది. అలాంటి వారి కోసం ఆర్టీసీ యాజమాన్యం వినూత్నంగా 'యాత్రాదానం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు పలు యాత్రలు, అధ్యాత్మిక ప్రాంతాలకు ప్రత్యేకబస్సులు నడుపుతున్న ఆర్టీసీ యాత్రాదానం పేరిట ఆదాయాన్ని ఆర్జించేందుకు నూతన కార్యక్రమాన్ని చేపట్టింది. ఆధ్యాత్మిక, పర్యాటక ప్రదేశాలను దాతల సహకారంతో అనాథలు, పేదలు సందర్శించేలా ఈ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

వీరికి అవకాశం కల్పించేలా..

జిల్లాలోని అనాథలు, ఆశ్రమాలలోని వృద్ధులు, దివ్యాంగులు, ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో చదివే పేద విద్యార్థులకు ఆర్టీసీ 'యాత్రాదానం'తో పర్యాటక, పుణ్య క్షేత్రాల సందర్శనకు తీసుకెళ్తారు. అందుకోసం రీజియన్‌లోని ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు డిపోల పరిధిలో డిపోమేనేజర్ల ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు.

దాతల చేయూతతో..

పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాలు, ఇతర ప్రత్యేక రోజులు, పండుగలు తదితర సందర్భాలు, సంతోషకరమైన రోజుల్లో అన్నదానం, రక్తదానం, నేత్రదానం, అవయవదానం ఎక్కువగా చేస్తుంటారు. ఈసందర్భాలలో అనాథలు, వృద్ధులు, దివ్యాంగులు, పేద విద్యార్థులకు పుణ్యక్షేత్రాల దర్శనం కల్పించటానికి ఆర్టీసీకి డబ్బులు విరాళంగా అందజేస్తే బస్సు సదుపాయం కల్పిస్తారు. అలాంటి దాతలు, సంస్థల సేవలను వినియోగించుకునేందుకు ఆర్టీసీ సిద్ధమైంది. ఎన్ఆర్ఐలతో పాటు కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు ముందుకు వచ్చి ఆర్టీసీ 'యాత్రాదానం'లో భాగస్వాములు కావొచ్చు.

మిత్రుల భాగస్వామ్యంతోనైనా..

యాత్రాదానం కార్యక్రమంలో దాతలు ఆధ్యాత్మిక సంతృప్తితో పాటు సామాజిక సేవ చేశామనే ఆనందం పొందవచ్చు. దాతలు ఏ పుణ్యక్షేత్రానికి యాత్రాదానం చేయదల్చుకున్నారో వివరాలతో డిపో మేనేజర్లను సంప్రదించాలి. యాత్రకు సంబంధించి కిలోమీటర్లను లెక్కించి దాని ప్రాతిపదికన ఏసీ, సూపర్‌లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సుల చార్జీలు వెల్లడిస్తారు. ఆపై బస్సులను ఎంచుకుంటే డిపోల నుంచి కేటాయిస్తారు. యాత్రకు సంబంధించి నగదును ఒకరైనా.. ఇంకొందరితో కలిపైనా చెల్లించవచ్చు.

పుణ్యక్షేత్రాలతో..

ఖమ్మం రీజియన్‌లో ఏడు డిపోలకు గాను మొత్తం 563 బస్సులు ఉన్నాయి. గతంలో జూన్ నుంచి పుణ్యక్షేత్రాలు, యాత్రల పేరిట అరుణాచలం తదితర ప్రాంతాలకు ప్రత్యేకరోజుల్లో బస్సులు ఏర్పాటు చేస్తున్నారు. రీజియన్ నుంచి 42 బస్సులు నడపగా 25,682 మంది భక్తులు ఉపయోగించుకున్నారు. తద్వారా రీజియన్‌కు రూ.17,03,668 ఆదాయం లభించింది.

సేవాభావంతో ముందుకు రండి..



సేవాభావంతో ప్రజాప్రతినిధులు, దాతలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు ఎవరైనా ముందుకు వచ్చి యాత్రాదానానికి సహకరించవచ్చు. సామాజిక సేవలో భాగంగా విరాళాలు ఇస్తే పేదలు పుణ్యక్షేత్రాలు, విజ్ఞాన, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సుల్లో సందర్శించే అవకాశం లభిస్తుంది. వారం రోజులు ముందుగానే బస్సును బుక్ చేసుకోవాలి. –ఎ.సరిరామ్, ఆర్టీసీ ఆర్ఎం, ఖమ్మం

అవినీతే కాటేసింది..!

- అక్రమాలు, నిర్వహణ లోపాలతోనే సొసైటీ పాలకవర్గాలపై వేటు
- నష్టాలను అధిగమించలేకపోవటం మరో కారణం

ఖమ్మంవ్యవసాయం: అవినీతి, అక్రమాలే సహకార సంఘాల పాలక వర్గాలను గద్దె దించాయి. 'కంచే చేను మేసిన చందం'గా జిల్లాలోని పలు సహకార సంఘాల పాలక వర్గాలు బాధ్యతలను విస్మరించాయి. సహకార సంఘాల సభ్యులుగా ఉన్న రైతులు తమ ప్రయోజనాలతో పాటు, సంఘం అభివృద్ధి లక్ష్యంగా ఎన్నికల్లో పోటీ చేసిన వారి నుంచి సమర్థులుగా గుర్తించిన వారిని సంఘం పాలకులు (డైరెక్టర్లు)గా ఎన్నుకున్నారు. డైరెక్టర్లు సంఘం అభివృద్ధి, రైతుల ప్రయోజనాలు కాపాడుతామని, అవినీతికి తావులేకుండా పాలనను అందిస్తామని ప్రమాణం చేసి బాధ్యతలు చేపట్టారు. వీరు సంఘం చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకొని వారి నాయకత్వాన పాలన సాగించారు. ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) పరిధిలో మొత్తం 101 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలకు 2020 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. ఐదేళ్ల కాలపరిమితి కలిగిన ఈ సహకార సంఘాల పాలకవర్గాల పదవీకాలం 2025 ఫిబ్రవరి వరకు ఉండగా, సహకార సంఘాల విభజన తదితర కారణాలతో పాలక వర్గాలకు ఆరునెలల పదవీ కాలాన్ని పెంచారు. ఆ కాలం కూడా ఆగస్టు 14తో ముగియగా, మరో 6నెలల కాలం పాలక వర్గాలకు అవకాశం కల్పించారు. అయితే ఈ ప్రక్రియలో అవినీతి, అక్రమాలు, పారదర్శకత లోపించిన పాలకవర్గాల స్థానాల్లో పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలో ఉన్న 76 సహకార సంఘాల్లో తొలి విడతలో మంగళవారం 38 సంఘాల పాలక వర్గాల కొనసాగింపునకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆరు సహకార సంఘాల పనితీరు బాగాలేకపోవటం, అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని గుర్తించి ఆయా సంఘాల పాలక వర్గాలను సహకార శాఖ రద్దు చేసింది. ఆయా సంఘాల నిర్వహణకు సహకార అసిస్టెంట్ రిజిస్ట్రార్లను పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించారు.

అక్రమాలు, నిర్వహణ లోపాలే కారణం

అవినీతి, అక్రమాలు, నిర్వహణా లోపాల కారణంగా జిల్లాలో ఇప్పటివరకు ఆరు సహకార సంఘాల పాలకవర్గాలను సహకారశాఖ రద్దుచేసింది. ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం సహకార సంఘంలో రుణాల పంపిణీలో అక్రమాలు చోటు చేసుకున్నట్లు గుర్తించారు. అంతేగాక గతంలో ఈ సంఘంలో ధాన్యం కొనుగోలులో పెద్ద కుంభకోణం చోటుచేసుకుంది. దీనికి తోడు ఈ సంఘం రుణబకాయిల ఫలితాన్ని సాధించలేక ఎన్‌పీఏ జాబితాలోకి చేరింది. దీంతో ఈ సంఘం పాలక వర్గం రద్దయింది. కూసుమంచి మండలంలోని చేగొమ్మ సహకార సంఘం రూ.1.52 కోట్లతో నిర్మించిన రెండు గోదాముల నిర్మాణంలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, దీంతో నాణ్యతా ప్రమాణాలు లేకపోవటం, సంఘం నిర్వహణ లోపాల కారణంగా పాలక వర్గాన్ని రద్దు చేశారు. నేలకొండపల్లి సహకార సంఘం దాదాపు రూ.1.50 కోట్ల నష్టాల్లో కూరుకుపోయి ఉంది. బకాయిల వసూలులో విఫలం కావటం, కొందరు డైరెక్టర్లు తీసుకున్న రుణాలు చెల్లించకపోవటం తదితర కారణాలతో ఈ సంఘం పాలక వర్గాన్ని రద్దు చేశారు. కల్లూరు సహకార సంఘంలో రూ.3 లక్షల అవినీతి చోటు చేసుకుంది. ఈ అవినీతిని రికవరీ చేయలేకపోవటం, గేదెల రుణాలు, డైరెక్టర్లు అధిక మొత్తంలో రుణ బకాయిలు కలిగి ఉండటం తదితర కారణాలతో ఈ సంఘం పాలక వర్గం రద్దయింది. కల్లూరు మండలంలోని పోచారం సహకార సంఘంలో కూడా అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయి. పాత బకాయిలు పేరుకుపోవటం, డైరెక్టర్లు అధిక మొత్తంలో రుణాలు పొంది చెల్లించకపోవటం వంటి కారణాలతో ఈ సంఘం పాలక వర్గాన్ని రద్దు చేశారు. ఇక తల్లాడ పాలక వర్గం కూడా డైరెక్టర్లు డిఫాల్టర్లుగా ఉండటం, ఈ సంఘంలో అవి నీతి అక్రమాలు చోటు చేసుకోవటంతో పాలక వర్గాన్ని రద్దు చేశారు. ఈ ఆరు సంఘాలతో పాటు జిల్లాలో మరో ఆరు సహకార సంఘాల పాలక వర్గాలను కూడా రద్దు చేసే అంశాన్ని సహకార శాఖ పరిశీలిస్తోంది. సహకార సంఘాల పాలక వర్గాల రద్దు వెనక రాజకీయ ప్రమేయం ఉందనే చర్చ జరుగుతోంది.

అటవీ శాఖకు నూతన హంగులు

నేడు రూ.90 కోట్ల పనులు ప్రారంభం



పరేడ్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అటవీ అమరవీరుల స్తూపం, పోడియం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి అటవీశాఖకు జిల్లా కేంద్రం తరహాలో నూతనహంగులు రానున్నాయి. టింబర్ డిపోప్రాంగణంలోని స్థలాన్నిపరేడ్‌గ్రౌండ్‌గా తీర్చిదిద్దారు. ఇందులోరూ.2లక్షలతో అటవీ అమరవీరుల స్తూపం, రూ.4 లక్షలతో పోడియం ఏర్పాటు చేశారు. డివిజన్‌స్థాయిలో ఉద్యోగులకు శిక్షణ, సమావేశాల నిర్వహణకోసం రూ.12 లక్షలతో మీటింగ్‌హాల్ నిర్మించారు.

నీలాద్రి అర్బన్ పార్కులో..

సందర్శకుల ఆదరణ పెరుగుతున్న నీలాద్రి అర్బన్ పార్కుకు రూ.10 లక్షలతో మారో రెండు బ్యాటరీ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. అర్బన్ పార్కులోని వన్యప్రాణులు బయటకు రాకుండా.. వీధి కుక్కలు లోపలికి చొరబడకుండా కన్జర్వేషన్ జోన్ ఏర్పాటు చేశారు. రూ.50 లక్షలతో 1.5 కిలోమీటర్ల మేర చైన్‌లింగ్ ఫెన్సింగ్‌తో రక్షణ చర్యలు చేపట్టారు. ఈ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్‌తో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభిస్తారని సత్తుపల్లి ఎఫ్‌డీఓ వాడపల్లి మంజుల, రేంజర్ స్నేహలత తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

చింతకాని: మండలంలోని మత్కేపల్లి క్రాస్ రోడ్డు వద్ద ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం పట్టుకున్నారు. తిమ్మినేనిపాలెం మున్నేరు నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ఎస్ఐ నాగుల్‌మీరా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సుదీర్ఘ పోరాటాల నేల తెలంగాణ

కలెక్టరేట్‌లో జాతీయ పతాకావిష్కరణలో అదనపు కలెక్టర్ శ్రీజ



కలెక్టరేట్‌లో జెండాకు వందనం చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంసహకారనగర్: సుదీర్ఘ పోరాటాల నేల తెలంగాణ అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ అన్నారు. బుధవారం తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో ఆమె జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణ ప్రాంతం తన అస్తిత్వం, గుర్తింపు కోసం సుదీర్ఘంగా పోరాటం చేసిందని, ఆనాడు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశారని, దశాబ్దాల పాటు ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడి సాధించుకున్నారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తరువాత బతుకమ్మ, బోనాలు, సంస్కృతి, కళలు, సంప్రదాయాలకు మంచి గుర్తింపు, ప్రాముఖ్యత లభించిందన్నారు. అభివృద్ధి ప్రమాణాలలో దేశంలోని అనేక రాష్ట్రాల కంటే తెలంగాణ ముందుందని, ప్రజల జీవన ప్రమాణాలు క్రమంగా మెరుగు పడ్డాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఎ.పద్మశ్రీ, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- జిల్లా పరిషత్‌లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జెడ్పీ సీఈఓ దీక్షారైనా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. తొలుత గాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ, పంచాయతీ రాజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.
- తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం కార్యాలయంలో జరిగిన తెలంగాణ ప్రజాపాలన దినోత్సవంలో సంఘం జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శేషప్రసాద్, విజయ్‌కుమార్, హరీశ్, రాంబాబు, మాధవరావు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల త్యాగాలతోనే విలీనం



నగరంలో వలంటీర్ల ప్రదర్శన

ఖమ్మంమయూరిసెంటర్: కమ్యూనిస్టుల త్యాగాలతోనే దేశంలో తెలంగాణ విలీనమైందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు అన్నారు. తెలంగాణ పోరాట చరిత్ర, కమ్యూనిస్టుల త్యాగాలను వక్రీకరిస్తే జాతి క్షమించదన్నారు. తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవ ముగింపు సభ బుధవారం నగరంలోని జెడ్పీ మీటింగ్‌హాలులో నిర్వహించారు. అంతకుముందు పాత బస్టాండ్ నుంచి జెడ్పీ వరకు భారీ ప్రదర్శన చేయగా.. జనసేవాదళ్ కార్యకర్తలు కవాతు నిర్వహించారు. ఆ తర్వాత జిల్లా కార్యదర్శి దండి సురేశ్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటం నాటి సామాజిక, ఆర్థిక పరిస్థితుల పట్ల అవగాహన లేని వారు ఇది మతపరమైన పోరాటంగా చిత్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ ముస్లిం అయినప్పటికీ ఆయన కింద ఉన్న జమిందార్లు, జాగీరుదారులు, పటేల్, పట్వారీలు 95 శాతం హిందువులేనన్నారు. వీరి చేతుల్లోనే ఎక్కువ భూమి ఉండేదని, గ్రామీణ ప్రాంతాల్లో వీరి అరచాకాలు ఎక్కువగా ఉండి ప్రజల మాన, ప్రాణాలు, ఆస్తులకు రక్షణ ఉండేది కాదని తెలిపారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జమ్ముల జితేందర్‌రెడ్డి, మహ్మద్ మౌలానా, యర్రా బాబు, ఎస్.కె. జానీమియా, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, బి.జి.క్లెమెంట్, మహ్మద్ సలాం, అజ్మీర రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ ఎంపిక పోటీలకు స్పందన



జిల్లా బాలికల కబడ్డీ జట్టు

ఖమ్మంస్పోర్ట్స్: జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికల ఎంపిక పోటీలకు స్పందన వచ్చింది. జిల్లావ్యాప్తంగా 200 మంది బాలురు, 80 మంది బాలికలు రావడంతో ఎంపిక ప్రక్రియ కష్టంగా మారిందని నిర్వాహకులు తెలిపారు. కాగా, జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఈ నెల 25 నుంచి 28వ తేదీ వరకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారు. ప్రక్రియను డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు తుంబూరు దయాకర్‌రెడ్డి, కె.క్రిష్టాఫర్‌బాబు పర్యవేక్షించారు. కార్యక్రమంలో నాగప్రసాద్, సీహెచ్. సుధాకర్, లాలయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన వారి వివరాలు..

బాలుర జట్టు: ఎ.సతీశ్, జి.వినయ్, డి.నాగఅఖిల్, జె.ఉమేశ్‌రెడ్డి, విఘ్నేశ్, కె.నితిన్, ఎ.నాగరాజు, బి.గణేశ్, కె.అశోక్‌కుమార్, బి.చిరు, పి.భార్గవకళ్యాణ్, ఎస్‌కే నశ్రీద్, బి.జగన్‌నాయక్, బి.రాఘవ, జె.వివేక్, యు.వెంకటకృష్ణ.

బాలికల జట్టు: బి.హనీ, జి.చరణ్య, జి.శైలజ, బి.చైత్ర, సప్తిక, సిరిచందన, నవిత, లిఖిత, తేజ, బాలనాగ, నాగమణి, కీర్తన, నాగ, శ్రీజ, శాన్వి, రేణుక, శ్రావణి, స్ఫూర్తి.

వేధింపుల కేసులో నిందితుడికి జైలు

కొత్తగూడెంటౌన్: అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడిన చుంచుపల్లి మండలం నందతండాకు చెందిన మాలోతు జానకీరామ్‌కు ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ బుధవారం మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.సాయిశ్రీ తీర్పు చెప్పారు. జూలూరుపాడు మండలం బేతాలపాడుకు చెందిన మాలోతు అరుణను 2012 జూన్ 14న చుంచుపల్లి మండలం నందతండాకు చెందిన మాలోతు జానకీరామ్‌కు ఇచ్చి వివాహం చేశారు. కట్నం కింద రూ.4 లక్షలు, ఆరు తులాల బంగారం, ద్విచక్రవాహనం, రూ.50 వేల విలువైన గృహోపకరణాలు అందజేశారు. ఏడాది తర్వాత జానకీరామ్ మద్యం తాగి వచ్చి శారీరకంగా హింసించేవాడని, వేరే పెళ్లి చేసుకుంటానంటూ వేధించడం ప్రారంభించాడని బాధితురాలు జానకీరామ్‌తో పాటు అతని తల్లి సోనా, ఆడబిడ్డ భూక్య విజయ, ఆమె కుమారులు మోహన్, యోగేశ్‌పై జూలూరుపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి ఐదుగురిపై చార్జ్‌షీట్ దాఖలు చేశారు. 10 మంది సాక్షులను విచారించాక మాలోతు జానకీరామ్‌పై నేరం రుజువుకావడంతో ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. మాలోతు సోని, భూక్య విజయ, భూక్య మోహన్, భూక్య యోగేశ్‌పై నేరం రుజువుకానందున కేసు కొట్టివేశారు. ఏపీపీ విశ్వశాంతి వాదించగా.. జూలూరుపాడు ఎస్ఐ రవికుమార్, కోర్టు నోడల్, లైజన్ ఆఫీసర్లు ప్రభాకర్, శ్రీనివాస్, పీసీ పి.ఉపేందర్‌రావు సహకరించారు.

ఆలయ అభివృద్ధే ప్రథమ ప్రాధాన్యం

- భక్తులకు సర్వ దర్శనం, వసతి సౌకర్యాలపై దృష్టి
- మాస్టర్ ప్లాన్, పుష్కరాలపై ముందస్తు ప్రణాళికలు
- సాక్షి ఇంటర్వ్యూలో రామాలయ ఈఓ కొల్లు దామోదర్ రావు



కొల్లు దామోదర్‌రావు

భద్రాచలం: భద్రాద్రి రామయ్య చెంతకు వచ్చే భక్తులకు ప్రశాంత దర్శనం, సకల సౌకర్యాల కల్పన, దేవస్థానం అభివృద్ధే ప్రాధాన్యతగా విధులు నిర్వర్తిస్తానని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి కొల్లు దామోదర్‌రావు తెలిపారు. ఇటీవల ఈఓగా బాధ్యతలు స్వీకరించిన ఆయన బుధవారం 'సాక్షి' ఇంటర్వ్యూలో పలు అంశాలపై మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

భక్తులకు సౌకర్యాల కల్పన

భద్రాచలం ఆర్డీఓగా పనిచేసి ఉండటంతో భద్రాచలం, దేవస్థానంపై అవగాహన ఏర్పడింది. దీంతో పాటు ఆలయ అభివృద్ధిలో కీలకమైన మాఢ వీధుల విస్తరణలో భూ సేకరణ చేసి నిర్వాసితులకు నష్టపరిహారం అందజేశాం. ఇప్పుడు ఆలయ ఈఓగా అదే అభివృద్ధిని కొనసాగించేందుకు కృషి చేస్తా. ఇప్పటికే భక్తులకు అందుతున్న ఆన్‌లైన్ సౌకర్యాలను ఇతర విభాగాలకూ విస్తరించేలా ప్రయత్నాలు చేస్తున్నాం. ఇక ప్రధానంగా రామాలయంలో నిర్వహించే సేవలు, ఆలయ ప్రాశస్త్యంపై ప్రచార లోపం ఉందనే అపోహలు తొలగించేందుకు ఆ సేవలు, ఇతర హోర్డింగ్‌లను భద్రాచలంతోపాటు మారుమూల ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. రంగనాయకుల గుట్టపై నిరుపయోగంగా ఉన్న టీటీడీ, అన్నవరం సత్రాలను పూర్తిగా తొలగించి ఉన్నతాధికారుల సూచనల మేరకు భక్తులకు వసతి సౌకర్యాలు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రామాలయం, పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తొలగించి క్లీన్ భద్రగిరిగా ఉంచేందుకు కృషి చేస్తా.

మాస్టర్ ప్లాన్, గోదావరి పుష్కరాలు..

ఇక ప్రభుత్వం సంకల్పించిన శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధిలో నా వంతు పాత్ర పోషిస్తా. ప్రధానంగా ఆలయం, ఉపాలయాల అభివృద్ధి, మార్పులు, చేర్పులపై ఆగమ శాస్త్ర ప్రకారం ఆలయ పండితులు, వైదిక కమిటీలతో సమన్వయం చేసుకుంటూ వారి సలహాలు, సూచనల మేరకు ముందుకెళ్తాం. ఈ మేరకు ఇప్పటికే వారితో సంప్రదింపులు జరుపుతున్నాం. చర్చలు ముగిశాక కలెక్టర్, ఇతరులతో కలిసి తగిన నివేదిక రూపొందించి ప్రభుత్వానికి అందిస్తాం. ఆలయ అభివృద్ధితోపాటు భక్తులకు సౌకర్యాల కల్పనే ప్రధాన అజెండాగా పని చేస్తాం. 2027 గోదావరి పుష్కరాలకు సంబంధించి ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకుంటాం. గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భక్తుల రద్దీని తట్టుకునేందుకు తాత్కాలిక వెయిటింగ్ గదులు ఏర్పాటు చేస్తాం. ఇందుకోసం మిథిలా స్టేడియం, ఇతర ప్రాంతాలను పరిశీలిస్తున్నాం. భక్తులకు సరిపడా లడ్డూలు, వీఐపీలకు ఇతర సేవలను దృష్టిలో ఉంచుకుని అధికారులు, సిబ్బంది సహాయ సహకారాలతో ఏర్పాట్లు చేసేందుకు ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందిస్తాం.

స్వామివారి భూములను కాపాడుకుంటాం

రాముడికి చెందిన భూములను చట్ట ప్రకారం కాపాడుకునేందుకు ప్రయత్నం చేస్తాం. ప్రధానంగా ఏపీలోని పురుషోత్తపట్నంలో రాముడి భూములు దేవస్థానానికి చెందేలా అన్ని పత్రాలు ఉన్నాయి. దీనిపై ఇప్పటికే క్షేత్రస్థాయిలో పరిశీలించాం. వీటిని న్యాయపరంగానే దక్కించుకుంటాం. ఏపీలోని అన్ని శాఖల సహాయ సహకారాలతో ఈ భూములపై పోరాడుతాం. ఇతర ప్రాంతాలలో ఉన్న భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటాం. భక్తులకు సేవ చేసేందుకు రామయ్య కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటా.

విద్యుదాఘాతంతో వ్యక్తికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న కార్తీక్

సత్తుపల్లిరూరల్: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని సత్యనారాయణపురం గ్రామంలో చోటుచేసుకుంది. గంగారం గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ కార్తీక్ పాకలగూడెం లైన్‌మెన్ లక్ష్మీనారాయణ వద్ద ప్రైవేట్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి సత్యనారాయణపురం, ఆంధ్రా సరిహద్దు ప్రాంతంలోని కోనరావుపాలెం వద్ద త్రీఫేజ్ పొలాలకు వెళ్లే విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో స్తంభం పైకి ఎక్కి మరమ్మతులు చేస్తున్నాడు. అదే సమయంలో విద్యుత్ సరఫరా కావటంతో షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

చేతికందిన పత్తి పంట ధ్వంసం



ధ్వంసమైన పత్తి పంటను చూపుతున్న రైతు

కారేపల్లి: చేతికందిన పత్తి పంటను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన ఘటన మండలంలోని గేటురేలకాయలపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. బాధిత రైతు కథనం ప్రకారం.. గేటురేలకాయలపల్లి గ్రామానికి చెందిన పోడురైతు ధర్మసోతు సూర్య తనకున్న 2 ఎకరాల పోడు భూమిలో పత్తి పంట సాగు చేస్తున్నాడు. ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి పెట్టి, పత్తి పంటను సాగు చేయగా.. కాయ దశకు చేరుకుంది. ఇంకా నెలరోజుల్లో పత్తి పంట చేతికందుతుందనుకున్న దశలో గుర్తుతెలియని వ్యక్తులు పత్తి పంటను వాహనాలతో ధ్వంసం చేశారు. మొక్కలను వేర్లతో సహా పెకిలించి పడేయడంతో కష్టపడి, రూ.2లక్షలు పెట్టుబడి పెట్టి పంట సాగుచేస్తే.. నేలమట్టం చేశారని బాధిత రైతు కుటుంబం కన్నీరుమున్నీరైంది. 30ఏళ్లుగా పోడు వ్యవసాయం చేస్తున్నామని, ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు రావాల్సి ఉందని, సర్వేలు సైతం పూర్తయ్యాయని, ఈ క్రమంలోనే అటవీశాఖ అధికారులు రాత్రివేళలో వచ్చి పత్తి పంటను ధ్వంసం చేశారని ఆరోపిస్తూ.. కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.